క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో గుంజ ప్రతిష్ట



నెల్లూరు రూరల్: నరసింహకొండపై వెలసిన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో నిర్వహించనున్న బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని గుంజ ప్రతిష్టను వేడుకగా గురువారం జరిపారు. ఉత్సవమూర్తులకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. గిరిప్రదక్షిణను రాత్రి నిర్వహించారు. దేవస్థాన చైర్మన్ సురేంద్రరెడ్డి, ఈఓ గిరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా రథోత్సవం



నెల్లూరు(బృందావనం): బాలాజీనగర్‌లోని సీతారామస్వామి మందిరంలో నిర్వహిస్తున్న సీతారామ, లక్ష్మణ, హనుమత్ సమేత అనంత కోదండరామస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా రథోత్సవాన్ని కనులపండువగా గురువారం జరిపారు. నేత్రపర్వంగా తీర్చిదిద్దిన రథంపై సీతా, లక్ష్మణ, హనుమంత సమేత అనంతకోదండరామస్వామి కొలువై భక్తులను కటాక్షించారు. పూజలు, తిరుమంజనాన్ని మందిర ప్రధానార్చకుడు నారాయణం దాశరథి భట్టాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు. స్వామివారిని భక్తులు దర్శించుకొని కొబ్బరికాయలు, గుమ్మడికాయలను కొట్టి కర్పూర హారతులతో మొక్కులను చెల్లించుకున్నారు. అనంతరం మందిర కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాదాన్ని అందజేశారు. ఉభయకర్తలుగా శ్రీనివాసులురెడ్డి, సంధ్య దంపతులు వ్యవహరించారు. సింహపురి ధార్మిక సంస్థ అధ్యక్షుడు భువనేశ్వరిప్రసాద్, మందిర కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేశ్వర్లుగుప్తా, వెంకటరత్నం, కోశాధికారి మస్తాన్‌రావు, పూర్ణచంద్రరావు, తదితరులు పర్యవేక్షించారు.

నేత్రపర్వంగా వేణుగోపాలుడి కల్యాణోత్సవం



నెల్లూరు(బృందావనం): మూలాపేటలోని రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని గురువారం జరిపారు. అనంతరం గజవాహనంపై భక్తులను కటాక్షించారు. ఉభయకర్తలుగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంతిరెడ్డి దంపతులు, ఆనం ప్రభాకర్‌రెడ్డి, సరోజనమ్మ, వెంకటరమేష్‌రెడ్డి, లక్ష్మీనిర్మలారెడ్డి వ్యవహరించారు.

వైభవంగా సీతారామ కల్యాణం



నెల్లూరు(బృందావనం): బారకాస్‌లోని శ్రీరామ మందిరంలో సీతారామ కల్యాణాన్ని కనులపండువగా నిర్వహించారు. ఉభయకర్తలుగా సుబ్బారావు, సత్యలక్ష్మి, మురళీకృష్ణ, సరిత దంపతులు వ్యవహరించారు. దేవస్థాన అధ్యక్షుడు శేషయ్య, సభ్యులు హనుమంతరావు, సత్యనారాయణ పర్యవేక్షించారు.

వైద్య వృత్తి ఎంతో ఉన్నతమైంది



మాట్లాడుతున్న సత్యవరప్రసాద్

నెల్లూరు(అర్బన్): వైద్య వృత్తి ఎంతో పవిత్రమైందని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషనల్ అడిషనల్ డీఎంఈ, ప్రముఖ న్యూరోసర్జన్ సత్యవరప్రసాద్ పేర్కొన్నారు. దర్గామిట్టలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో మొదటి సంవత్సర వైద్య విద్యార్థులకు ఫ్రెషర్స్ డేను గురువారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. రానున్న రోజుల్లో నెల్లూరు మెడికల్ కళాశాలను దేశంలోనే ఉత్తమంగా నిలపాలని కాంక్షించారు. తొలుత హాస్పిటల్లోని విభాగాలను పరిశీలించి రికార్డులను సత్యవరప్రసాద్ తనిఖీ చేశారు. డీఎంఈ కార్యాలయాధికారి డాక్టర్ రామన్, మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ మురళీకృష్ణ, జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ సిద్ధానాయక్, డాక్టర్లు వెంకటేశ్వర్లు, కాలేషాబాషా, మస్తాన్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

వైద్య రంగానికి అధిక ప్రాధాన్యం



ఫ్యామిలీ డాక్టర్‌ను ప్రారంభిస్తున్న మంత్రి కాకాణి, ఎంపీ ఆదాల


- మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

నెల్లూరు రూరల్: రాష్ట్రంలో పేద, మధ్య తరగతి వర్గాల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని వైద్య రంగానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యమిస్తున్నారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. ఫ్యామిలీ డాక్టర్‌ను ఆమంచర్లలో ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డితో కలిసి మంత్రి గురువారం ప్రారంభించారు. 104 వాహనాలను ప్రారంభించిన అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. ఫ్యామిలీ డాక్టర్ ద్వారా అని గ్రామాల్లో వైద్యసేవలను అందించనున్నారని చెప్పారు. మంచాలకే పరిమితమైన రోగుల ఇంటికి సైతం వైద్య సిబ్బంది వెళ్లి తగిన సలహాలు, వైద్యసేవలను అందించనున్నారని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో వైద్య రంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేశారని, 108, 104 వాహనాలు మూలనపడ్డాయని చెప్పారు. తమ ప్రభుత్వం వీటిని పునరుద్ధరించిందని తెలిపారు. రాష్ట్రంలోని పీహెచ్‌సీలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లలో వైద్యుల కొరత లేదన్నారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని సమస్యలను పరిష్కరించగల సమర్థుడు ఆదాల ప్రభాకర్‌రెడ్డి అని కొనియాడారు. రానున్న ఎన్నికల్లో నియోజకవర్గం నుంచి మంచి మెజార్టీతో ఈయన విజయం సాధించడం తథ్యమన్నారు. సీఎంకు అన్ని వర్గాల ప్రజల ఆశీస్సులు ఉండాలని కోరారు.

అన్ని విధాలా గ్రామాల అభివృద్ధి

తమ ప్రభుత్వ హయాంలో గ్రామాలు అన్ని విధాలా అభివృద్ధి చెందుతున్నాయని ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గంలోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లలో వైద్య పరీక్షలు సైతం అందుబాటులో ఉన్నాయని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి మాట్లాడారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలపై నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి గతంలో వేధింపులకు పాల్పడ్డారని ఆరోపించారు. సమస్యల పరిష్కార విషయమై తన వద్దకు లేదా ఎంపీ వద్దకు పార్టీ నేతలు, కార్యకర్తలు వెళ్తే వారిపై కక్షసాధింపు చర్యలకు పాల్పడేవారని చెప్పారు. నియోజకవర్గంలోని గ్రామాల అభివృద్ధికి జెడ్పీ నిధులు రూ.రెండు కోట్లను మంజూరు చేస్తే, పనులు జరగనీయకుండా కోటంరెడ్డి సోదరులు అడ్డుకున్నారని ధ్వజమెత్తారు. జేసీ కూర్మనాథ్, డీఎంహెచ్‌ఓ పెంచలయ్య, విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, రూరల్ ఎంపీపీ విజయ్‌కుమార్, రూరల్ ఇన్‌చార్జి ఎంపీడీఓ శైలేంద్రకుమార్, పార్టీనేతలు వెంకటేశ్వర్లునాయుడు, రత్నయ్య, నారయ్య, సురేంద్రరెడ్డి, మస్తానయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఐక్య ప్రభురాత్రి భోజన ఆరాధన



నెల్లూరు(బృందావనం): వీఆర్సీ సెంటర్ సమీపంలోని బాప్టిస్ట్ చర్చి డానీహాల్ ఆధ్వర్యంలో ఐక్య ప్రభురాత్రి భోజన ఆరాధనను గురువారం ఘనంగా నిర్వహించారు. డానీహాల్ ఇంగ్లిష్ సర్వీస్ చాప్లిన్ రెవరెండ్ డేవిడ్ లివింగ్‌స్టన్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఇండియన్ ఎవాంజికల్ మిషన్ నేషనల్ సెక్రటరీ క్రిస్టఫర్ వాక్యోపదేశం చేశారు. మాండే థర్స్‌డే, గుడ్ ఫ్రైడే ప్రాధాన్యాన్ని వివరించారు. అనంతరం ప్రభురాత్రి భోజన సంస్కారాన్ని నెల్లూరు ది లివింగ్ షెఫర్డ్స్ బాప్టిస్ట్ చర్చి పాస్టర్ రెవరెండ్ అబ్రహాం నిర్వహించారు. ఐక్య బల్ల ఆరాధన చైర్మన్ రెవరెండ్ డేవిడ్ దయాసాగర్,



బాప్టిస్ట్ చర్చి డానీహాల్ కార్యదర్శి అరుణ్‌కుమార్, షారోన్ మినిస్ట్రీస్ పాస్టర్ రెవరెండ్ భాస్కరయ్య, పాస్టర్లు డేవిడ్, మోజెస్ విజయ్‌కుమార్, జెరోం, రాజశేఖర్ దాసరి, రూఫస్ కమలాకర్, హరిపాల్, డానీహాల్ చైర్మన్ సురేంద్రబాబు, కోశాధికారి విజయభాస్కర్, డీకన్స్, తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



నెల్లూరు సిటీ: ఓ హోటల్ ఎదుట గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన గురువారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. ఆత్మకూరు బస్టాండ్ సమీపంలోని ఓ హోటల్ వద్ద 35 ఏళ్ల గుర్తుతెలియని వ్యక్తి మృతి చెంది ఉండటాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోలీసులు పరిశీలించగా, ఎలాంటి వివరాలు లభ్యం కాలేదు. పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. నవాబుపేట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

97.81 శాతం మందికి పింఛన్లు



నెల్లూరు(పొగతోట): వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ ప్రక్రియ జిల్లావ్యాప్తంగా కొనసాగుతోంది. జిల్లా వ్యాప్తంగా 97.81 శాతం మంది లబ్ధిదారులకు నగదును వలంటీర్లు గురువారం నాటికి పంపిణీ చేశారు. 3,07,447 మందికి పింఛన్ కానుకను అందజేయాల్సి ఉండగా, 3,00,718 మందికి అందజేశారు. 6,729 మందికి పంపిణీ చేయాల్సి ఉంది.

చంద్రబాబు పర్యటనకు బందోబస్తు

నెల్లూరు సిటీ: టీడీపీ అధినేత చంద్రబాబు జిల్లా పర్యటనకు పోలీసులు పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశారు. నగరంలోని ఎస్వీజీఎస్ కళాశాల మైదానంలో శుక్రవారం నిర్వహించనున్న కార్యక్రమంలో ఆయన పాల్గొననున్నారు. ఈ క్రమంలో 200 మంది పోలీస్ అధికారులు, సిబ్బంది బందోబస్తులో పాల్గొననున్నారు.

కల్యాణం.. కమనీయం

నెల్లూరు(బృందావనం): నగరంలోని శబరి శ్రీరామ క్షేత్రంలో సీతాదేవి, కోదండరామస్వామి కల్యాణ మహోత్సవాన్ని కనులపండువగా గురువారం నిర్వహించారు. అనంతరం భక్తులకు మంగళసూత్రధారాలు, ముత్యాల తలంబ్రాలను అందజేశారు. స్వామివారు గజవాహనంపై ఊరేగారు. ఉభయకర్తలుగా వీరరాఘవరావు, పావని దంపతులు వ్యవహరించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): వేణుగోపాలస్వామి రథోత్సవాన్ని నిర్వహించనున్న నేపథ్యంలో డైకస్‌రోడ్డు సబ్‌స్టేషన్ పరిధిలోని రామయ్యబడి ఫీడర్‌లో గల పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా శుక్రవారం ఉండదని వెస్ట్ – 1 ఏఈ లక్ష్మీబాయి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వేణుగోపాలస్వామి ఆలయం, కోనేటిమిట్ట, కొండదిబ్బ, బ్రాహ్మణవీధి, రాజావారి వీధి, అలంకార్ సెంటర్, తదితర ప్రాంతాల్లో ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సరఫరా ఉండదని చెప్పారు.

వేడుకగా హనుమ విజయోత్సవం

నెల్లూరు(బృందావనం): చైత్ర పౌర్ణమిని పురస్కరించుకొని మూలాపేటలోని పరమేశ్వరినగర్‌లో గల అభయాంజనేయస్వామి ఆలయంలో హనుమ విజయోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో గురువారం నిర్వహించారు. ఉభయకర్తలుగా శ్రీనివాసకుమార్, నిర్మల దంపతులు వ్యవహరించారు. ఆలయ ప్రధానార్చకుడు రాఘవేంద్ర గోపీస్వామి పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాల లబ్ధిని వివరించాలి

నెల్లూరు రూరల్: ప్రభుత్వం ద్వారా ప్రజలు పొందిన లబ్ధిని జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో వివరించాలని జేసీఎస్ మండల కన్వీనర్ సురేష్‌రెడ్డి పేర్కొన్నారు. ఎంపీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి సూచనల మేరకు ఐదు డివిజన్లకు చెందిన కార్పొరేటర్లు, గృహ సారథులు, సచివాలయాల కన్వీనర్లు, వలంటీర్లతో సమావేశాన్ని 21వ డివిజన్లో గురువారం నిర్వహించారు.

ముందు జాగ్రత్తల్లో భాగంగానే అనుమతి నిరాకరణ

నెల్లూరు సిటీ: పొట్టేపాళెం కలుజు వద్ద జలదీక్షకు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పిలుపునిచ్చారని, అయితే ముందు జాగ్రత్తల్లో భాగంగానే అనుమతిని నిరాకరించామని రూరల్ డీఎస్పీ వీరాంజనేయరెడ్డి పేర్కొన్నారు. తన కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పొట్టేపాళెం కలుజు మీదుగా జొన్నవాడ, బుచ్చిరెడ్డిపాళెం, నరసింహకొండ, తదితర ప్రాంతాల నుంచి అనేక వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయని, జలదీక్ష కారణంగా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడే అవకాశం ఉందని చెప్పారు. జలదీక్షకు ఎంత మంది వస్తారో దరఖాస్తులో నమోదు చేయలేదని, చెరువు వద్ద నీటి లోతు, బురద, దాని స్థితిగతులు తెలియకుండా దీక్ష చేయడం ప్రమాదకరమన్నారు. పదో తరగతి పరీక్షల నేపథ్యంలో పొట్టేపాళెం వైపు రాకపోకలు సాగించే విద్యార్థులు ఇబ్బందులు పడే అవకాశం ఉందని వివరించారు. కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి వయస్సు, ఆరోగ్యం దృష్ట్యా అనుమతిని నిరాకరించామని పేర్కొన్నారు.

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం

నెల్లూరు (బారకాసు): బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని మినీబైపాస్ రోడ్డులోని పార్టీ జిల్లా కార్యాలయ ఆవరణలో గురువారం నిర్వహించారు. పార్టీ జెండాను పార్టీ జిల్లా అధ్యక్షుడు భరత్‌కుమార్‌యాదవ్ ఆవిష్కరించారు. నేతలు ఆంజనేయరెడ్డి, సురేంద్రరెడ్డి, సురేష్‌రెడ్డి, శ్రీనివాసులు, రాజేష్, విజయ్‌కుమార్, గిరికుమార్‌గౌడ్, ఫణిరాజు, బాలయ్యగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

వాల్ పెయింటింగ్ ప్రారంభం

వీఆర్సీ సెంటర్ సమీపంలోని కల్యాణి ఫిల్మ్స్ ఎదురుగా ఏర్పాటు చేసిన వాల్ పెయింటింగ్‌ను బీజేపీ జిల్లా అధ్యక్షుడు భరత్‌కుమార్‌యాదవ్ ప్రారంభించారు. జిల్లాలోని ప్రతి మండలంలో వాల్ పెయింటింగ్స్‌ను వేయిస్తామని చెప్పారు. నేతలు రాజేశ్వరి, విజయశ్రీ, శ్రీనివాసులు, గిరికుమార్‌గౌడ్, అశోక్‌నాయుడు, షాజహాన్, షఫీ, తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి పెద్దపీట

- ఎమ్మెల్యే అనిల్‌కుమార్
- రూ.1.2 కోట్లతో నూతన అర్బన్ హెల్త్ సెంటర్ ప్రారంభం



అర్బన్ హెల్త్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న అరుణమ్మ, పక్కన ఎమ్మెల్యే అనిల్, తదితరులు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, వారికి వైద్యం దగ్గరగా ఉండాలనే లక్ష్యంతో నాడు – నేడు పథకం ద్వారా అర్బన్ హెల్త్ సెంటర్ల సంఖ్యను పెంచడమే కాకుండా పాత అర్బన్ హెల్త్ సెంటర్లను పునర్నిర్మిస్తోందని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ పేర్కొన్నారు. నగరంలోని 13వ డివిజన్లో గల యలమవారిదిన్నెలో రూ.1.2 కోట్లతో నిర్మించిన అర్బన్ హెల్త్ సెంటర్‌ను జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మతో కలిసి గురువారం ప్రారంభించిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. ఇప్పటికే ఏడు అర్బన్ హెల్త్ సెంటర్లను ప్రారంభించామని, ఏడో డివిజన్లో మరో సెంటర్‌ను త్వరలో ప్రారంభించనున్నామని వెల్లడించారు. మిట్టపాళెంలో పార్కు, బలిజపాళెంలో పాఠశాలను త్వరలో ప్రారంభించనున్నామని పేర్కొన్నారు. డివిజన్లో నూరు శాతం పనులను పూర్తి చేసేలా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. అనంతరం డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి మాట్లాడారు. యలమవారిదిన్నెలో అన్ని వసతులతో అర్బన్ హెల్త్ సెంటర్‌ను ఏర్పాటు చేయడంపై ఆనందం వ్యక్తం చేశారు. తన నాయకుడు బాగుండాలనే మనస్తత్వం కలిగిన వ్యక్తి అనిల్‌కుమార్ అని కొనియాడారు. అలాంటి మంచి వ్యక్తిని మరోసారి ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. రానున్న ఎన్నికల్లో నగర ఎమ్మెల్యేగా అత్యధిక మెజార్టీతో గెలుపొందాలని కాంక్షించారు. కార్పొరేటర్ నాగార్జున, తదితరులు పాల్గొన్నారు.

కలిసికట్టుగా ఆలయాన్ని నిర్మించుకుందాం

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): అందరూ కలిసికట్టుగా ఆలయాన్ని నిర్మించుకుందామని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ పేర్కొన్నారు. నగరంలోని 14వ డివిజన్లో గల బాలాజీనగర్, పద్మావతినగర్, తదితర ప్రాంతాల్లో అధికారులతో కలిసి పర్యటించిన ఎమ్మెల్యే మాట్లాడారు. బాలాజీనగర్, పద్మావతినగర్, శ్రీనగర్, రామ్‌జీనగర్ ప్రాంతాల్లో ఓ ఆలయాన్ని నిర్మించాలని కార్పొరేటర్లు, ప్రజలు కోరారని చెప్పారు. పద్మావతినగర్‌లో వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని నిర్మిస్తే బాగుంటుందనే అందరి ఆలోచన మేరకు సంబంధిత అధికారులతో మాట్లాడామన్నారు. నిర్మాణానికి రూ.పది కోట్లు ఖర్చవుతుందని భావిస్తున్నామని, అందరి సహకారంతో కార్యక్రమాన్ని ప్రారంభించాలనే సంకల్పంతో ముందుకెళ్తున్నామని చెప్పారు. ఆయా ప్రాంతాల వారితో ఓ కమిటీని వేసి వారి ఆధ్వర్యంలో ఆలయ నిర్మాణాన్ని చేపట్టేలా చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. మంచి ముహూర్తం చూసి త్వరలోనే భూమి పూజ చేయనున్నామని వెల్లడించారు. కార్పొరేటర్ ప్రతాప్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఫ్లడ్ బ్యాంక్‌ను తప్పక నిర్మిస్తాం



వృద్ధుడితో మాట్లాడుతున్న అనిల్‌కుమార్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): ఫ్లడ్ బ్యాంక్‌ను తప్పక నిర్మిస్తామని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ పేర్కొన్నారు. నగరంలోని 54వ డివిజన్లో గల నేతాజీవీధి, రెహ్మాన్ వీధి, లక్ష్మీ వీధి, అంబేడ్కర్ కాలనీ, తదితర ప్రాంతాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని వందో రోజు గురువారం ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రభుత్వం ఏర్పడ్డాక 53, 54వ డివిజన్లలో దాదాపు రూ.30 కోట్లతో పనులను చేపట్టామని వివరించారు. ఫ్లడ్ బ్యాంక్ పనులను ఇప్పటికీ ప్రారంభించలేదంటూ కొందరు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. నిర్మాణానికి సంబంధించిన మెటీరియల్ వస్తోందని, సాంకేతిక అనుమతులు వచ్చిన వెంటనే పనులను ప్రారంభిస్తామని పేర్కొన్నారు. కార్పొరేటర్ సఫియాబేగం, నగరపాలక సంస్థ కో ఆప్షన్ సభ్యుడు జమీర్, తదితరులు పాల్గొన్నారు.

ఫైలేరియా కిట్ల పంపిణీ



నెల్లూరు (అర్బన్): కోటమిట్ట, చాకలివీధిలోని అర్బన్ హెల్త్ సెంటర్ల ఆధ్వర్యంలో నగరంలోని 43, 44, 46, 47, 48, 49వ డివిజన్లలో గల ఫైలేరియా వ్యాధిగ్రస్తులకు కిట్లను గురువారం అందజేశారు. మెడికల్ ఆఫీసర్లు ఆశ్రిత, రూప, డాక్టర్లు వెంకటేష్, ప్రసూన, కమ్యూనిటీ ఆర్గనైజర్ తిరుపతయ్య, తదితరులు పాల్గొన్నారు.